సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం ၊ 8 ၊ మే ၊ 2024



**పేదలకు కార్పొరేట్ విద్య**

ఉన్నత వర్గాల వారి పిల్లలకే పరిమితమైన ప్రైవేట్ పాఠశాలల విద్యను నేడు ప్రభుత్వం పేద పిల్లలకు సైతం చేరువ చేస్తోంది.

- 8లో



**సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం**

సాధారణ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడంలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా అన్నారు.

- 8లో



**జనంలేని యువగళం**

విజయనగరం జిల్లా కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేత నారాలోకేశ్ మంగళవారం నిర్వహించిన యువగళం సభ జనంలేక బోసిపోయింది.

- 8లో

## న్యూస్‌రీల్

### డిపాజిట్ గల్లంతు అంటే...?

పార్వతీపురం: ఎన్నికల సమయంలో మీ డిపాజిట్ గల్లంతయినట్లే అని వ్యాఖ్యానిస్తుంటారు. డిపాజిట్ అంటే ఏమిటి? అనే సందేహం వస్తూ ఉంటుంది. అదేంటో తెలుసుకుందాం. సాధారణంగా అసెంబ్లీ ఎన్నికలకు ఎవరైనా అభ్యర్థి నామినేషన్ వేయాలంటే ఓసీ, బీసీలు డిపాజిట్ కింద రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఎంపీగా పోటీ చేయాలంటే సాధారణ కేటగిరి అభ్యర్థులు రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.12,500లు ధరావత్తు చెల్లించాలి. ఇది తిరిగి చెల్లించే నగదు (రిఫండబుల్). అయితే ఎవరైతే ఎన్నికల్లో డిపాజిట్ దక్కించుకుంటారో వారికి మాత్రమే ఆ నగదు తిరిగి ఇస్తారు. డిపాజిట్ దక్కని వారికి ఇవ్వరు. డిపాజిట్ దక్కాలంటే పోలైన మొత్తం ఓట్లలో కనీసం 1/6 శాతం ఓట్లు పోటీ చేసే అభ్యర్థికి దక్కాలి.

### ఏకలవ్యలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీతంపేట ఐటీడీఏ పీవో శుభం బన్సల్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈపీ గ్రూపుల్లో మొత్తం 76 సీట్లకు గాను భామినిలో 33, మెళియాపుట్టిలో 43 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 7న భామిని ఈఎంఆర్ఎస్‌లో కౌన్సెలింగ్ ఉంటుందని స్పష్టం చేశారు.

### నేడు ఎస్వీ డిగ్రీ కళాశాలకు ముగ్గురు కమిటీ సభ్యుల రాక



ప్రిన్సిపాల్ చలపతిరావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోగల శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీకళాశాలకు రాష్ట్ర కాలేజియేట్ కమిషనర్ డాక్టర్ పోల.భాస్కర్ ఆదేశాల మేరకు త్రిసభ్య కమిటీసభ్యులు బుధవారం వస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమ కళాశాలకు నాక్ (జాతీయగుర్తింపు నిర్ధారణచేసే కౌన్సిల్) బృందం ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలలో రానున్నందున ముందస్తుగా ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అమరావతి నుంచి డాక్టర్ కె.విజయ్‌బాబు (ఓఎస్డీ), డాక్టర్ జె.జాన్‌కిరణ్ (అకడమిక్ ఆఫీసర్), ఈ.వరప్రసాద్(అకడమిక్ ఆఫీసర్)లు కళాశాలకు వస్తున్నట్లు తెలిపారు. వీరు కళాశాలను సందర్శించి నాక్ కమిటీ వచ్చే సమయానికి చేయాల్సిన పనులు, రికార్డులు, అకడమిక్ విధానం, విద్యాప్రమాణాలు పెంచేందుకు తగు సూచనలు, కళాశాలలో మెరుగు పరచాల్సిన పలుఅంశాలు, అకడమిక్ కార్యకలాపాల మెరుగుకు సూచనలు, సలహాలను అందిస్తారని తెలిపారు. కళాశాలలో బోధన సిబ్బందితో మాట్లాడి బోధనలో తీసుకోవాల్సిన అంశాలపై వివరిస్తారని తెలిపారు.

### పిడుగు పడి వ్యక్తికి గాయాలు

భామిని: మండలంలోని పెద్దదిమిలికి చెందిన బలగ అప్పలనాయుడు మంగళవారం పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు.రోజంతా ఉరుములు, మబ్బులతో పాటు అప్పలనాయుడు ఇంటిపై పిడుగు పడడంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. పిడుగు ధాటికి ఇంట్లో ఉన్న అప్పలనాయుడు గాయపడ్డాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన కొత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యసేవలు పొందుతున్నాడు.

### పీహెచ్‌సీలో నిరంతర వైద్యసేవలు



రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ పావని

సీతానగరం: స్థానిక పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ బి.పావని అన్నారు. ఆశా డేని పురస్కరించుకుని పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు నిరంతర వైద్య సేవలందించేందుకు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎంఎల్‌హెచ్‌పీ కేంద్రాల్లో అన్ని రకాల వ్యాధుల నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి రోజుకు 50 నుంచి 60 మందికి వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ ఎస్వీ రమణ, పీహెచ్ఎన్ సత్యవతి పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ ఆడబిడ్డనయ్యా

ఏజెన్సీలో గిరిజన ప్రజలందరికీ నేను ఆత్మబంధువును. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ ఆడబిడ్డనయ్యాను. పదేళ్లుగా పాలకొండ నియోజకవర్గ ప్రజలు నన్ను ఆదరిస్తూ అండగా నిలుస్తున్నారు. ఈ ప్రేమాభిమానాలు మున్ముందూ ఇలాగే సాగాలని దేవుడిని ప్రార్థిస్తున్నా. నియోజకవర్గంలోని 102 సచివాలయాల పరిధిలోని దాదాపు 78 వేల గడపల వద్దకు వెళ్లి వారందరితో మమేకమయ్యా. కష్టసుఖాలు తెలుసుకున్నా. ఇన్ని వేల కుటుంబాలను నాకు ఇచ్చింది జగనన్నే.'' అని పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని విశ్వాసరాయి కళావతి అన్నారు. పాలకొండ నియోజకవర్గంలో ఇంతవరకు చేసిన అభివృద్ధి, ఇంకా చేయబోయే పనులు..కూటమి దుష్ప్రచారం తదితర అంశాలను 'సాక్షి'తో ముఖాముఖిలో ఆమె వివరించారు. వివరాలు ఆమె మాటల్లోనే..

–సాక్షి, పార్వతీపురం మన్యం



- గిరిజనుల ఆత్మబంధువును
- ఏజెన్సీ ప్రజలకు ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసం
- పదేళ్లు అండగా నిలిచారు
- చంద్రబాబు వస్తే ఇప్పుడున్న పథకాలకు ముగింపు పడినట్లే..
- సాక్షితో పాలకొండ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి

### ప్రజల కోసమే..పదవి

మా కుటుంబంలో చాలామంది ఎమ్మెల్యేలున్నారు. నేను రెండుసార్లు గెలిచాను. పదవులు మాకు ముఖ్యం కాదు. విలువలతో కూడిన ఎదుగుదల మా పెద్దల నుంచి నేర్చుకున్నా. అందుకే ఎప్పుడూ నిరాడంబరంగా ఉంటా. మా ప్రజల ప్రతి కష్టసుఖంలో నూ తోడుగా ఉంటా. వారితో కలిసిపోతాను. ఎప్పుడూ ప్రజల్లోనే ఉండాలని మా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చెబుతుంటారు. అందుకే అందరూ నన్ను ఆశీర్వదిస్తూ, వారి బిడ్డగా చూసుకుంటారు. ఇప్పుడు ప్రచారానికి వెళ్లినప్పుడు కూడా ఎక్కడికక్కడ బ్రహ్మరథం పడుతున్నారు. మళ్లీ వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో మరింతగా ప్రజలకు సేవ చేసుకుంటాం.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అయితేనే తమకు మేలు చేస్తాడన్న నమ్మకం, భరోసా గిరిజనులందరిలోనూ ఉందని వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాస రాయి కళావతి అన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వివిధ సంక్షేమ పథకాల కింద దాదాపు రూ.1,300 కోట్ల మేర నియోజకవర్గంలోని పేదలకు అందించామని చెప్పారు. నాన్ డీబీటీ కింద సుమారు రూ.218 కోట్ల మేర వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులు పొందారని వివరించారు. గడిచిన 59 నెలల కాలంలోనే ఇదంతా సాధించామని చెప్పారు. ఎన్నికలొచ్చాయని ప్రజల ముందుకు బూటకపు హామీలతో వస్తున్న విషపు కూటమి నేతలను ఎవరూ నమ్మవద్దని హితవు పలికారు.

### సంపూర్ణంగా మహిళా సాధికారత

2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమలు చేసిన నవరత్నాల పథకాలు ప్రతి ఇంటికీ అందాయి. జీవితాలను బాగు చేశాయి. గతంలో ఏ ప్రభుత్వమూ ఇన్ని పథకాలను విజయవంతంగా 99 శాతం అమలు చేసింది లేదు. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మ ఒడి పథకాన్ని రూ.17 వేలకు పెంచుతున్నాం. రైతులకు ఇచ్చే భరోసా మొత్తం రూ.16 వేలు అవుతుంది. దీనివల్ల రైతుకు మరింత సాయం అందించేవారమవుతాం. మహిళల సాధికారత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమైంది. ప్రతి పథకం మహిళలకే అందుతోంది. చేయూత పథకం ద్వారా ఎంతో మంది స్వయం ఉపాధి పొందారు. కొందరు భూములు, బంగారం కొనుగోలు చేసుకుని భవిష్యత్తు అవసరాలకు ఉంచుకున్నారు.

### నిన్ను ఎలా నమ్ముతారు బాబూ..

గత టీడీపీ హయాంలో నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా గిరిజనులకు ఎటువంటి పథకాలూ అందలేదు. కనీసం రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు వంటివి కూడా లేవు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే వలంటీర్ల ద్వారా లబ్ధిదారులను గుర్తించి ప్రతి ఇంటికీ మేలు చేశాం. ఇప్పుడు ప్రతిపక్షాలన్నీ కూటమిగట్టి..బూటకపు హామీలిస్తున్నాయి. అవేవీ నమ్మశక్యంగా లేవు. 2014 మేనిఫెస్టోలో చంద్రబాబు ఇచ్చిన 600 హామీల్లో ఎన్ని అమలు చేశారు? పోనీ, ఇప్పుడు మేనిఫెస్టో కూడా ఉమ్మడిగా ఇచ్చే ధైర్యం చేయలేకపోయారు. కూటమిలోని బీజేపీ దూరంగా ఉంది. అంటే..దాని అమలు మీద వారిలో వారికే నమ్మకం లేదు. ఇంక ప్రజలు ఎలా నమ్ముతారు..

### అభివృద్ధి అంటే ఇది కాదా?

59 నెలల కాలంలో గతంలో ఏ ప్రభుత్వమూ చేయని అభివృద్ధి నియోజకవర్గంలో చేసి చూపించాం. కొన్ని పెండింగ్ పనులు మిగిలిపోయాయంటే..అది గత టీడీపీ ప్రభుత్వ కక్షపూరిత వైఖరే. ఆ విషయం విజ్ఞులైన నియోజకవర్గ ప్రజలు, మేధావులందరికీ తెలుసు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో 4,086 మందికి ఇళ్ల పట్టాలిచ్చాం. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాం. కిమ్మి–రుషింగి వంతెన నిర్మాణం రూ.27.50 కోట్లతో పూర్తి చేశాం. సీతంపేటలో సుమారు రూ.50 కోట్లతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరుగుతోంది. సీతంపేట ఆస్పత్రిని రూ.19 కోట్లతో అప్‌గ్రేడ్ చేశాం. టీటీడీ ద్వారా రూ.10 కోట్లతో ఆలయాన్ని నిర్మించాం. 146 దేవాలయాలకు ఒక్కో గుడికి రూ.10 లక్షలు చొప్పున టీటీడీ దేవస్థానం నుంచి మంజూరు చేయించాం. బత్తిలిలో రూ.2.5 కోట్లతో మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టాం. నియోజకవర్గంలో రూ.214 కోట్లతో సుమారు 234 కి.మీ. మేర రోడ్లు, 41 కి.మీ మేర డ్రైన్లు వేశాం. 102 సచివాలయాల నిర్మాణం, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం, నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి మా హయాంలోనే చేపట్టాం. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలు చొప్పున వెచ్చించి మరిన్ని పనులు చేశాం. సంక్షేమ పథకాల లబ్ధి కోసం మరో రూ.1,500 కోట్లకుపైగా వెచ్చించాం. ఇదంతా అభివృద్ధి కాదా? ముందు ప్రభుత్వాలు ఇవేవీ ఎందుకు చేయలేదు? మాపై దుష్ప్రచారం చేస్తున్న వారు వీటికి సమాధానం చెప్పగలరా? కరోనా వంటి కష్టకాలంలో పేదలకు మా ప్రభుత్వం అండగా నిలిచింది. అందుకే ఇప్పుడు ధైర్యంగా వారి వద్దకు వెళ్లగలుగుతున్నాం. పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం.

### పర్యాటకంగా అభివృద్ధి, ఉపాధి

సీతంపేటలో పర్యాటకంగా అభివృద్ధికి అనేక అవకాశాలున్నాయి. రూ.2.5 కోట్లతో అదలి వ్యూపాయింట్, గిరిజన మ్యూజియం అభివృద్ధితోపాటు, మరికొన్ని ప్రాంతాలు, జలపాతాలపై దృష్టి సారించాం. ఇప్పటికే ఇక్కడ అడ్వెంచర్‌పార్కు ఉంది. నేను అభివృద్ధి కోరుకునేదానిని. టూరిజం కోసం అప్పట్లోనే ప్రశ్నించా. యువతకు కూడా స్థానికంగానే ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో పరిశ్రమలు తెచ్చే ఆలోచన ఉంది. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టాం. దాదాపు 10 వేల మంది వరకూ ఇక్కడే ఉపాధి లభిస్తే బాగుంటుందన్నది నా ఆలోచన.

### కూటమికి ప్రజలే బుద్ధి చెబుతారు..

కూటమి పేరుతో ఓట్ల కోసం వస్తున్న వారి గత చరిత్ర ఎలాంటిదో ఇక్కడ అందరికీ తెలుసు. వారి అవినీతి గురించి ఎంత చెప్పినా తక్కువే. వారికి ప్రజలే ఓట్ల ద్వారా బుద్ధి చెబుతారు.

# ఎన్నికల కమిషన్ పక్షపాతం



విలేకరులతో మాట్లాడుతున్న రాజన్నదొర

- చంద్రబాబు దారుణంగా మాట్లాడినా చర్యలేవీ?
- గతంలో టీడీపీ పసుపు, కుంకుమకు అనుమతి
- ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పథకాల అడ్డగింత
- మీడియాతో డిప్యూటీ సీఎం, సాలూరు అసెంబ్లీ అభ్యర్థి రాజన్నదొర

మక్కువ: ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరి స్తుందని, ఐవీఆర్‌సర్వే ద్వారా ప్రచారం చేసినా, టీడీపీ నాయకులు దారుణంగా మాట్లాడుతున్నా పట్టించుకోవడంలేదు. ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన వార్తలను గమనించి సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ అభ్యర్థి పీడిక రాజన్నదొర కోరారు. ఈ మేరకు మక్కువ మండలంలోని ఎస్.కె.గైశీల గ్రామంలో మంగళవారం మంత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ 14ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు, తమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తల్లి విజయమ్మపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పటికీ ఎలక్షన్ కమిషన్ ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

**కొత్త పథకాలైతే అడ్డుకోవాలి**

పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రెగ్యులర్‌గా అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగించేందుకు అనుమతి ఇచ్చారని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పలు సంక్షేమ పథకాలను ఎలక్షన్ కమిషన్ నిలిపివేసిందని విమర్శించారు. కొత్తగా పథకాలు అందిస్తే అడ్డుకోవాలని, గత ఐదేళ్లుగా ప్రజలకు అందిస్తున్న పథకాలను అడ్డుకోవడం దారుణమన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం మూడురోజుల ముందు పసుపు, కుంకుమ పథకం అందించిందని, అప్పట్లో ఎందుకు ఎలక్షన్ కమిషన్ అడ్డుకోలేదని ప్రశ్నించారు. ఎలక్షన్ కమిషన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసినట్లుందని అనుమానం వ్యక్తం చేశారు. రైతులకు ప్రభుత్వం ధాన్యం నగదు అందించలేదని ఐవీఆర్ఎస్ ద్వారా ప్రతిపక్షాలు లేనిపోని తప్పుడు ప్రచారం చేస్తున్నా, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను కాల్చివేసినా, సీఎం జగన్ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పటికీ, టీడీపీ నాయకులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఎలక్షన్ కమిషన్ తమ హక్కులను సక్రమంగా నిర్వహించడం లేదని డిప్యూటీసీఎం రాజన్నదొర ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులపై పెట్టిన కేసులపై సీఐడీ అధికారులు త్వరితగతిన నిగ్గుతేల్చాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ, బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు పాల్గొన్నారు.

# ఈదురు గాలుల బీభత్సం

గుమ్మలక్ష్మీపురం: మండలంలో మంగళవారం వేకువజాము నుంచే భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలుల వల్ల మండలంలోని ఆలవడ్డ గ్రామంలో పత్తిక ముసురమ్మ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. అలాగే వామాసి గ్రామంలో కూడా ఓ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. గోరటి గ్రామంలో నిలిపి ఉన్న ద్విచక్రవాహనాలు గాలిధాటికి పడిపోవడంతోపాటు గ్రామంలోని నలుగురి ఇంటిపైకప్పు రేకులు ఎగిరిపోయాయి. లప్పటి గ్రామంలో రైతు మల్లేష్ పాకపై విప్ప చెట్టు కొమ్మ పడటంతో పాక కూలిపోయింది.

**సీతంపేటలో భారీ వర్షం**

సీతంపేటలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో అత్యధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. ఈ వర్షంతో జీడి,మామిడి తోటలకు నష్టం ఏర్పడిందని గిరిజన రైతులు తెలిపారు.

**ఊరటనిచ్చిన వర్షం**

పాలకొండరూరల్: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలు ఊరటనిచ్చాయి. సగటున రోజుకు 44డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో ఈ వర్షాలతో వాతావరణం చల్లబడింది. మరోవైపు ఖరీఫ్ దగ్గరపడుతుండడంతో ఈ వర్షాలు రైతులకు అనుకూలంగా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.



గుమ్మలక్షీపురం: గాలులకు పడిపోయిన ద్విచక్ర వాహనాలు, పైకప్పు రేకులు ఎగిరిపోవడంతో దెబ్బతిన్న ఇళ్లు



పాలకొండ పట్టణంలో కురుస్తున్న వర్షం

# ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- మూడవ రోజు వినియోగించుకున్న ఉద్యోగులు 1422 మంది
- రెండవ రోజు హోమ్ ఓటింగ్ వినియోగించుకున్న వారు 201 మంది

పార్వతీపురం టౌన్:

ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఐదు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో మంగళవారం మూడవరోజు ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో సౌకర్యాలను కల్పించడంతో ఉద్యోగులు ప్రశాంత వాతావరణంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**పరిశీలించిన ఎన్నికల సాధారణ పరిశీలకుడు**

ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి నిషాంత్ కుమార్‌తో కలిసి సాధారణ ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా మంగళవారం పరిశీలించారు. ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా ఓటర్లకు అందుతున్న సహకారం, జాబితాలో ఓటరు పేరు ఉన్నది లేనిది తనిఖీ చేశారు. తరువాత పోలింగ్ సరళి, బ్యాలెట్ పేపర్లు, కవర్ల పంపిణీ, బ్యాలెట్ బాక్స్ ఏర్పాటును నిశితంగా గమనించారు. ఎన్నికల కమిషన్ కల్పించిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వివిధ శాఖల ఉద్యోగులు వినియోగించుకోవాలని పరిశీలకుడు కోరారు. ఈ పరిశీలనలో పార్వతీపురం అసెంబ్లీ నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ కె.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

**మూడవ రోజు ఓటింగ్ ఇలా**

| నియోజకవర్గం | తొలిరోజు | రెండవరోజు | మూడవరోజు |
|---|---|---|---|
| పార్వతీపురం | 1098 | 499 | 377 |
| సాలూరు | 546 | 561 | 211 |
| కురుపాం | 910 | 888 | 486 |
| పాలకొండ | 726 | 584 | 348 |

తొలి రెండు రోజులు 5812 మందిఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ముడవరోజు 1422 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సాధారణ ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్

**రెండో రోజు హోమ్ ఓటింగ్**

| నియోజకవర్గం | 6వ తేదీ | 7వ తేదీ |
|---|---|---|
| సాలూరు | 74 | 89 |
| పార్వతీపురం | 110 | 97 |
| కురుపాం | 36 | 36 |
| పాలకొండ | 95 | 15 |

ప్రతి నియోజకవర్గంలో పది టీమ్‌లతో హోమ్ ఓటింగ్ ప్రక్రియను ఎలక్షన్ కమిషన్ పకడ్బందీగా నిర్వహించింది. ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేసిన ఈ వెసులుబాటును 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు వినియోగించుకున్నారు. జిల్లావ్యాప్తంగా 592 హోమ్ ఓటింగ్‌కు అర్హులు ఉండగా రెండురోజుల్లో 516 మంది వినియోగించుకున్నారు. తమకు హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించినందుకు ఎలక్షన్ కమిషన్‌కు వారంతా కృతజ్ఞతలు తెలిపారు.

**నేటితో పూర్తి కానున్న ఓటింగ్**

ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి పార్వతీపురం మన్యం జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం బుధవారంతో పూర్తి కానుంది. ఉద్యోగులకు మే 5,6 తేదీల్లో శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు సమర్పించి ఇంకా ఓటు హక్కు వినియోగించుకోలేని వారి అభ్యర్థన మేరకు మరో రెండు రోజులు ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు.



పార్వతీపురం పట్టణంలో హోమ్ ఓటింగ్ విధానంలో ఓటు వేసిన వృద్ధురాలు

## క్లుప్తంగా

### నాటుబండిని ఢీకొట్టిన లారీ: వ్యక్తికి గాయాలు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై చిన్నారాయుడుపేట–గుచ్చిమి గ్రామాల మధ్య ఇసుకతో వెళ్తున్న నాటుబండిని వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొన్న సంఘటనలో ఎద్దులతో బండి తోలుతున్న వ్యక్తి మంగళవారం గాయాల పాలయ్యాడు. అప్పయ్యపేట గ్రామానికి చెందిన జి బాలకృష్ణ సువర్ణముఖి నదిలో తన నాటుబండికి ఇసుక లోడ్ చేసుకుని నర్సిపురం తోలుతున్నాడు. అదే సమయంలో బొబ్బిలి నుంచి పార్వతీపురం వెళ్తున్న లారీ ఇసుకతో ఉన్న నాటుబండిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన బాలకృష్ణకు పార్వతీపురం ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

### జనంలేని యువగళం

- లోకేశ్ యువగళం సభకు ముఖం చాటేసిన జనసేన, బీజేపీ జిల్లా నాయకులు
- సభను పట్టించుకోని యువకులు



జనంలేక బోసిపోయిన యువగళం సభ

విజయనగరం రూరల్: విజయనగరం జిల్లా కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేత నారాలోకేశ్ మంగళవారం నిర్వహించిన యువగళం సభ జనంలేక బోసిపోయింది. లోకేశ్ పొంతనలేని సమాధానాలు నవ్వుతెప్పించాయి. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టుకు లోకేశ్, ఆయన టీమ్ సభ్యులు ప్రదర్శించిన యాక్టింగ్ జతకావడంతో సభకు హాజరైన ఆ పార్టీ నాయకులకే విసుగుపుట్టించింది. స్థానిక అయోధ్య మైదానంలో లోకేశ్ యువగళం సభ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. జనం హాజరుకాక పోవడంతో సాయంత్రం 5.10 గంటలకు ప్రారంభించారు. యాంకర్‌ను సైతం విజయవాడ నుంచి రప్పించుకుని తనకు, తన పార్టీకి అనుకూలమైన ప్రశ్నలు అడిగించుకుని మరీ జవాబులు చెబుతుంటే జిల్లా యువత ఆశ్చర్యానికి లోనయ్యారు. రానున్న ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విశాఖను దేశంలోనే నంబర్ వన్ ఉద్యోగ రాజధానిగా చేస్తామని ప్రగల్భాలు పలికారు. 2014 ఎన్నికల హామీల్లో భాగంగా నిరుద్యోగి భృతి ఇస్తామని చెప్పి ఎగనామం పెట్టారని తన టీమ్ సభ్యులే అడగడంతో కంగుతున్న లోకేశ్.. ఈ సారి అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి అందిస్తానని నమ్మించారు. జీఓ నంబర్ 3పై అవగాహన లేదని, పరిశీలించి జీఓ రద్దుకు కృషి చేస్తామని మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఇన్‌కమ్ ట్యాక్స్ కడుతున్నవారికీ సంక్షేమ పథకాలు అందిస్తానని సత్తిరాజు అనేవ్యక్తి ప్రశ్నకు లోకేశ్ సమాధానమిచ్చారు. సభకు టీడీపీ మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మొఖం చాటేశారు.

### అంతులేని విషాదం..



గుడెపువలస కిరణ్ (ఫైల్)



లంక సూరప్పల నాయుడు (ఫైల్)

భోగాపురం/డెంకాడ: వారిద్దరూ గతంలో వేర్వేరు గ్రామాల్లో వలంటీర్లుగా పనిచేస్తూ వారి కుటుంబాలకు ఆసరాగా ఉండేవారు. అయితే ఈ మధ్యకాలంలో విపక్షాల విష ప్రచారంతో విసుగు చెందిన వీరిద్దరు ఒకేసారి విధులకు రాజీనామా చేశారు. ఎలాగూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని.. తిరిగి చేరుదామని ఆలోచనలో ఉన్నారు. అయితే ఇంతలో జరగరాని ఘోరం జరిగిపోయింది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ ఒకేసారి మరణించడంతో ఆయా కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... డెంకాడ మండలం సింగవరం గ్రామానికి చెందిన కిరణ్ (26).. లంకపేటకు చెందిన లంక సూరప్పలనాయుడు (32) వలంటీర్లుగా పనిచేసి ఇటీవల రాజీనామ చేశారు. వీరిద్దరూ సోమవారం రాత్రి పెట్రోల్ కొట్టించేందుకు స్కూటీపై భోగాపురం వచ్చి తిరుగుముఖం పడుతుండగా.. వెనుకనుంచి వచ్చిన కారు వీరిని ఢీ కొట్టింది. దీంతో సంఘటనా స్థలంలోనే ఇద్దరూ కన్నుమూశారు. కిరణ్‌కు ఏడాది కిందటే వివాహం జరగ్గా, ప్రస్తుతం అతని భార్య శైలజ గర్భవతి. మరో మృతుడు సూరప్పలనాయుడుకు మూడేళ్ల కిందట వివాహం జరగ్గా.. భార్య మాధవి, ఏడాది పాప ఉంది. మృతులిద్దరూ కుటుంబాలకు పెద్దదిక్కు కావడంతో వారి కుటుంబాల్లో చీకటి అలముకుంది. ప్రమదానికి కారణమైన కారు డ్రైవర్ పిట్టా సురేష్ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. ప్రమాదంలో అతనికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

**ఎమ్మెల్యే బడ్డుకొండ పరామర్శ..**

భోగాపురం మండలంలోని సుందరపేట ఆస్పత్రిలో ఉన్న గూడెపువలస కిరణ్, లంక సూరప్పలనాయుడు మృతదేహాలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనరసయ్య, ఆయన కుమారుడు ప్రదీప్‌నాయుడు సందర్శించి, నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి, ఓదార్చారు.

# నిన్ను నమ్మలేం బాబూ..!

- కూటమి మేనిఫెస్టోతో ఉద్యోగుల్లో ఆందోళన
- అభ్యర్థులకు షాకిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళి



పార్వతీపురంటౌన్:

టీడీపీ మేనిఫెస్టోతో ఉద్యోగుల్లో మార్పు కనిపిస్తోంది. ఇందుకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లే నిదర్శనం. మూడు రోజులుగా సాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో ఉద్యోగులంతా వైఎస్సార్‌సీపీకి పూర్తి మద్దతు తెలియజేస్తున్నట్లు తెలుస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 6810 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉంటే రెండు రోజుల్లోనే భారీగా ఓటింగ్ నమోదైంది. ఇందులో ఎక్కువ శాతం ఓటర్లు వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గుచూపినట్లు జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అమలుకాని హామీలతో ప్రజల్ని బురిడీ కొట్టించాలని చంద్రబాబు చూస్తున్నారని ఉద్యోగులు ఓ నిశ్చితాభిప్రాయానికి వచ్చినట్లు ఓటింగ్ సరళిని చూస్తే అర్థమవుతోంది. కూటమి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను అమలు చేయాలంటే తమ జీతాల్లో కోత తప్పదని భావించి ఉద్యోగులు వారి ఓట్లను గంపగుత్తగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు చెమటలు పట్టిస్తోంది. ఉద్యోగులంతా తమకు మద్దతుగా నిలుస్తారనుకుంటే..మొత్తం వ్యతిరేకమయ్యారని తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు కూటమి శ్రేణులే చర్చించుకుంటున్నాయి. కూటమి నేతలు సూపర్‌సిక్స్ పేరుతో ప్రవేశ పెట్టిన పథకాల అమలు సాధ్యం కాదని ఉద్యోగులు తేల్చేశారు. వాటిని అమలు చేయాలంటే ఏడాదికి రూ.3 లక్షల కోట్లు అవసరం ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్న మాట. మొన్నటివరకు చంద్రబాబు అండ్ కో ఏపీ శ్రీలంక అవుతుందని చేసిన ప్రచారం వారి మేనిఫెస్టోతో ఇప్పుడేమవుతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామాల్లో ఓట్ల కొనుగోలుపై ఫోకస్**

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల పోలింగ్ అనుకూలంగా లేకపోవడంతో కూటమి అభ్యర్థులు షాక్‌కు గురవుతున్నారు. దీంతో పల్లెలు, పట్టణాల్లోని ఓటర్ల కొనుగోలుపై దృష్టి సారించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులు అక్రమంగా సంపాదించిన సొమ్ముతో కొందరు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినట్లు ప్రచారం జరుగుతోంది. పార్వతీపురం పట్టణంలోని పలువురు టీడీపీ నేతలు గ్రామాల్లో ఓటుకు రూ. 3వేల వరకు ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పాలకొండ నియోజకవర్గంలో గిరిజన ఓటర్లను మభ్యపెట్టేందుకు జనసేన, కూటమి అభ్యర్థులు ఓటుకు రూ.2వేల వరకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. సాలూరు నియోజకవర్గంలో టీడీపీ ప్రచారానికి ఎవరూ రాకపోవడంతో ప్రతి వార్డుకు, గ్రామానికి రోజుకు రూ.5వేలు చొప్పున ఖర్చు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇకపోతే ఎన్నికల సమయంలో తమకు అనుకూలంగా ఉండేందుకు కొందరు అధికారులను రోజూ మద్యం బార్లకు తీసుకెళ్లి బేరసారాలు అడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే..నిత్యం గ్రామాల్లో కూటమి అభ్యర్థుల మాట వినకపోతే వారితో గొడవలకు దిగి ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో చిచ్చుపెడుతున్నారు.

**ప్రజాస్పందన కరువు**

కూటమి అభ్యర్థులకు వారు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ఆశించిన స్థాయిలో ప్రజాదరణ కనిపించడంలేదు. డబ్బులిచ్చి జనాలను తరలిస్తున్నా, కొద్ది సేపటికే ముఖం చాటేస్తున్నారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన సభలకు జనం రాకపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తుపై ఆయనకు ఎటూ పాలుపోవడంలేదు. స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులను కొన్నంత సులభంగా ఓట్లు బదిలీ అవుతాయనే వారి భ్రమ సైతం తొలిగిపోయింది. ఆచరణ సాధ్యం కాని మేనిఫెస్టోను ప్రకటించడంతో చంద్రబాబుపై నమ్మకం ప్రజల్లో మరింత సన్నగిల్లింది.

**ఓటమి భయంతోనే పర్యటనలు**

కూటమి అభ్యర్థుల ప్రచారానికి జనాదరణ కరువైంది. వార్డుల్లో, గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారానికి స్థానిక నాయకులు సొంతంగా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో స్థానిక టీడీపీ నాయకులే ప్రచారానికి దుమ్మా కొడుతున్నారు. ఏమి చేయాలో తోచక అది కప్పి పుచ్చుకొనేందుకు అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల ప్రచారానికి సినీనటులు, కేంద్రమంత్రులు వస్తున్నారని జిల్లా అంతా కోడై కూస్తోంది.

## పేదలకు ఉచితంగా.. కార్పొరేట్ విద్య

- ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం



తరగతి గదిలో చదువుతున్న విద్యార్థులు

పార్వతీపురం: ఉన్నత వర్గాల వారి పిల్లలకే పరిమితమైన ప్రైవేట్ పాఠశాలల విద్యను నేడు ప్రభుత్వం పేద పిల్లలకు సైతం చేరువ చేస్తోంది. ఎలాంటి ఖర్చులేకుండా 1వ తరగతి నుంచి పదోతరగతి వరకు ఖరీదైన, నాణ్యమైన విద్యను ఉచితంగా అందజేస్తోంది. ఈ మేరకు ప్రతి ఏటా జిల్లాలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు పేదవారికి కేటాయిస్తున్నారు. ఈ పథకం ద్వారా ఈ ఏడాది 198మందికి అవకాశం లభించనుంది. దీంతో పేద, మధ్యతరగతి వర్గాల వారికి చెందిన పిల్లలకు కార్పొరేట్ చదువులు అందనుండడంతో ఆయా కుటుంబాల్లో సర్వత్రా హర్షం వ్యక్త మవుతోంది.

**అమల్లో విద్యాహక్కు చట్టం**

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాలో 90 పాఠశాలల్లో ఉండగా వాటిలో 25శాతం సీట్లను ఉచిత విద్యకు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని పాఠశాలల యాజమాన్యాలు అంగీకరించి విద్యాశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. ఐదేళ్లు నిండిన వారికి మాత్రమే 1వ తరగతిలో ప్రవేశం కల్పిస్తుండగా రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లను కేటాయిస్తున్నారు.

**లాటరీ పద్ధతిలో ఎంపిక**

ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం ఉచిత సీట్లను లాటరీ పద్ధతిలో మొదటి విడత సీట్లు ఎంపిక చేశారు. వారంతా ఆయా పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశం పొందాల్సి ఉంది. ఈ విషయమై ఎంఈఓలు ప్రత్యేక శ్రద్ధ చూపి ఎంపికైన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో చేరేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులను చెల్లించనుంది. ఇంతవరకు 93మంది ఆయా పాఠశాలల్లో చేరారు. మిగిలినవారు కొద్ది రోజుల్లో చేరనున్నారు.

## ఎన్నికల భారతం పుస్తకావిష్కరణ



ఎన్నికల భారతం పుస్తకావిష్కరణ చేస్తున్న అభ్యుదయవాది జగన్నాథస్వామి, తదితరులు

విజయనగరం టౌన్: ఓటర్లను చైతన్యవంతం చేసి.. ప్రజాస్వామ్య విలువలు కాపాడాలనే ఉద్దేశంతో ఎన్నికల భారతం అనే కవితా సంకలనాన్ని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రజల ముందుకు తీసుకువచ్చిందని అభ్యుదయవాది జగన్నాథస్వామి అన్నారు. మంగళవారం స్థానిక గురజాడ స్వగృహంలో ఎన్నికల భారతం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంకలనంలో ఎన్నికల భారతంపై నిర్వహించిన కవితల పోటీలలో ఉత్తమమైన 20 కవితలతో పాటు శ్రీశ్రీ, జాషువా, కాళోజీ వంటి పాతతరం కవులతో పాటు ఈనాటి కవులు పాపినేని శివశంకర్, గొరునాయుడు, స్వామినాయుడు, అనిల్ డానీ వంటి కవుల కవితలు పొందుపరిచినట్లు చెప్పారు.

# వైఎస్సార్‌సీపీలో 70 కుటుంబాల చేరిక

- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి



సీతంపేట: వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి



పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీలో చేరిన అంటిపేట టీడీపీ నాయకులు


సీతంపేట: ఐదేళ్ల ప్రభుత్వ పాలనకు ఆకర్షితులైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కుటుంబాలతో సహా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఈ మేరకు సీతంపేట మండలంలోని బిల్లుమడ, వెంపలగూడ, ముకుందాపురం, పులిపుట్టి గ్రామాలకు చెందిన 70 కుటుంబాల వారు మంగళవారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన గంటా ప్రసాద్, నవీన్‌కుమార్, ఎల్.రమేష్, పి.రమేష్, పి.జోగారావు, తిరుపతిరావు, పి.కృష్ణ, పి.సునీల్, ఉమ, ఎం.బాలకృష్ణ, ఎస్.ఆనందరావు, పి.మన్మథరావు తదితరులకు వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మరికొద్ది రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు తామంతా సిద్ధమని పార్టీలో చేరిన వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామారావు, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.

**అంటిపేటలో 20 కుటుంబాలు**

పార్వతీపురం టౌన్: సీతానగరం మండలం పరిధిలో గల అంటిపేట పంచాయతీ నుంచి 20 టీడీపీ కుటుంబాలు మంగళవారం పార్వతీపురం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారందరినీ ఎమ్మెల్యే జోగారావు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు కృషిచేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో ప్రకాశరావు కోట పైడమ్మ, కోట గోవింద్, కోట శివ, దీన, బోనెల అప్పలస్వామి, బోనెల లక్ష్మి, శివ, నాగమ్మ, బలరాం, లక్ష్మిల తో పాటు 20 కుటుంబాల వారున్నారు. మాజీ జెడ్పీటీసీ అంటిపేట కృష్ణంనాయుడు, సర్పంచ్ బొంగు తిరుపతిరావు, దానబాబు, తిరుపతిరావు, సిరికి శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

- సాధారణ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్ మెహర్దా



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా

పార్వతీపురం: సాధారణ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడంలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్ మెహర్దా అన్నారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో సూక్ష్మ పరిశీలకులకు ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ రహస్యంగా, ప్రశాంతంగా జరగాలని, ఓటరు మినహా పోలింగ్ కేంద్రాలలోకి ఎవరినీ అనుమతించరాదని చెప్పా రు. పోలింగ్ జరిగిన చోట ఎక్కడైనా హింసాత్మక ఘటనలు జరిగితే ప్రిసైడింగ్ అధికారి, పోలీస్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించా రు. పోలింగ్‌లో ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనను ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని చెప్పారు. పోలింగ్ రోజున మాక్‌పోలింగ్, పోలింగ్ ముగింపు అతి ముఖ్యమన్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ప్రచారం చేయ డం నిషేధమని పేర్కొన్నారు. ఓటరు మాత్రమే ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి రావాలని, ఇతరులు ఎవరినీ లోపలికి అనుమతించరాదని స్ప ష్టం చేశారు. నియమించిన పోలింగ్ ఏజెంట్లు ఉదయం 5గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

**జనరల్ ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్**

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి నిషాంత్ కుమార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు 11వ తేదీ సాయంత్రం 5 గంట ల వరకు మాత్రమే ప్రచారం చేసుకోవచ్చని వెల్లడించారు. పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలకు కచ్చితంగా మాక్ పోలింగ్‌ను జనరల్ ఏజెంట్ల సమక్షంలో నిర్వహించాలన్నారు. ఉదయం 7 గంటల సమయానికి పోలింగ్ మొదలు కావాలని, మాక్ పోలింగ్ సర్టిఫికెట్ తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎవరైనా నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటుహక్కు ప్రశాంతంగా వినియోగించుకునే విధంగా మహిళలు, పురుషులకు వేరు వేరుగా క్యూలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ అనుమతించిన గుర్తింపు కార్డు చూపించిన వారికి ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాలవద్ద స్ట్రైకింగ్ పోలీస్ ఫోర్స్ నిఘా ఉంటుందన్నారు. సీఆర్‌సీ పూర్తయిన వెంటనే పోలింగ్ సీల్ చేయాల ని, మైక్రో అబ్జర్వర్ల రిపోర్ట్ పూర్తి చేయాలని వివరించారు. ప్రిసైడింగ్ అధికారులు మాత్రమే మొబైల్ ఫోన్ వాడేందుకు అవకాశం ఉందని చెప్పారు. మే 12న పోలింగ్ సామగ్రి పంపిణీ కార్యక్రమం చేపట్ట నున్నామన్నారు. పోలింగ్ కేంద్రాలవద్ద వెబ్ కాస్టింగ్, వీడియోగ్రాఫ్ చిత్రీకరణ ఉంటుందని ఎన్నికల పోలింగ్ సరళి, నిర్వహణ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ ఉంటుందని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఫొటో, వీడియోగ్రాఫ్, సెల్ఫీలు నిషేధమని ఆదేశించారు. మాక్ పోలింగ్ నుంచి పోలింగ్ ముగింపు వరకు నిర్వహించాల్సిన ప్రక్రియను పవర్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్ అవగాహన కల్పించారు.

# విజయం మీదే..!

- ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులకు ఓటర్ల హామీ..

సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ పడుతున్న అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం హయాంలో ఐదేళ్ల పాటు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఓటర్లతో మమేకమవుతున్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే నవరత్నాలు ప్లస్2 మేనిఫెస్టోను మాట తప్పకుండా అమలు చేసి, పేదల కళ్లలో సంతోషం విరబూయిస్తామని చెబుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఓటర్లు కూడా మీ వెంటే మేముంటామంటూ అభ్యర్థులకు భరోసా ఇస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం: మొరమ గ్రామంలో వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణికి ఘనంగా స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



వీరఘట్టంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి, పక్కనే ఎమ్మెల్సీ విక్రాంత్



పార్వతీపురంటౌన్: పిట్టలవలస గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు



మక్కువ: కాకువానివలస ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర

## రిసెప్షన్ సెంటర్ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: రిసెప్షన్ సెంటర్ల వద్ద పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, ఎస్పీ దీపికతో కలిసి డెంకాడ మండలంలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్ సెంటర్‌ను మంగళవారం పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్‌రూమ్‌లు, బారికేడింగ్, పార్కింగ్, భోజన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. లెండి కళాశాలలో రాజాం, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని.. ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను తీసుకు వచ్చే అధికారులు, సిబ్బంది రాకపోకలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. బస్సులు, అధికారుల వాహనాలు లోపలికి రావడానికి, సిబ్బందిని దించి బయటకు వెళ్లడానికి వీలుగా మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది ఈవీఎంలతో లోపలికి వచ్చిన దగ్గర నుంచి.. తమకు కేటాయించబడిన కౌంటర్లకు సులువుగా చేరుకునేలా నేమ్‌బోర్డులు, డైరెక్షన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయాలని చెప్పారు. పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్‌డీఏ ఎస్‌డీ అనిత, రిసెప్షన్ సెంటర్ నోడల్ అధికారులు మెప్మా పీడీ ఎం.సుధాకరరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజు, డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కరరావు, డీఎస్‌ఓ మధుసూదనరావు, అధికారులు పాల్గొన్నారు.


విజయనగరం రూరల్ మండలం ద్వారపూడిలో వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్, వైఎస్సార్ రైతుభరోసా కేంద్రం

# మనసు తెలిసిన మారాజు జగన్

గర్భస్థ శిశువు దశ నుంచి వృద్ధాప్య దశ వరకూ ఎవరికేమి కావాలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే తెలుసు... మా మనసు తెలిసిన మారాజు... ఆయన చల్లగా ఉండాల... అని కొందరు, మేము గత ఎన్నికల్లో ఓటేయక పోయినా మాకు మేలు చేశారు, ఇప్పుడు ఆయనకు ఓటేస్తాం అని మరికొందరు తమ మనసులో మాటను కుండబద్దలుకొట్టి చెప్పారు. నాడు–నేడు అనేలా స్కూళ్లు, గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్, రోడ్లు ఇలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత 58 నెలల కాలంలో చేసిన అభివృద్ధి కళ్లముందు కనిపిస్తుందని, వాటి ప్రయోజనమేమిటో అనుభవమైందని కొంతమంది అన్నారు. నవరత్నాల పథకాలతోనే కాదు కరోనా కష్టకాలంలోనూ ఆదుకున్నవారిపై విశ్వాసం ఉంచుకుంటామని మరికొంతమంది చెప్పారు. ఎన్నికల వేళ జనం ఎటువైపు ఉన్నారన్నదే ఎక్కడా సాగుతున్న చర్చ. ఈ సందర్భంగా విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ద్వారపూడి, గుంకలాం, గుంకలాం జగనన్న కాలనీ, గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బోడసింగిపేట, మామిడిబంద కాలనీ, గజపతినగరం, పార్వతీపురం నియోజకవర్గం పరిధిలోని సీతానగరం, వెంకంపేట వరకూ సాగిన 'సాక్షి' రోడ్ షోలో పలువురిని పలకరించాం. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తమకు జరిగిన మేలును ప్రస్తావిస్తూనే కచ్చితంగా మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.

– అల్లు సూరిబాబు, సాక్షి ప్రతినిధి, విజయనగరం

- మాకేమి కావాలో జగన్‌కు మాత్రమే తెలుసు
- ఓటేయకపోయినా మేలు చేశారు... మేలు చేసినందుకు ఓటేస్తాం
- జగన్ చేసిన అభివృద్ధి మనం దరి కళ్ల ముందు కనిపిస్తుంది
- కరోనా కష్టకాలంలోనూ అన్నలా ఆదుకున్నారు
- అన్నివిధాలా ఆదుకున్నవారిపై విశ్వాసం ఉంచుకుంటాం
- 'సాక్షి రోడ్‌షో'లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఓటర్ల మనోగతం

## విజయనగరం అసెంబ్లీ పరిధి ద్వారపూడిలో...

గత టీడీపీ పాలనలో కేంద్ర మంత్రిగా ఉన్న పూసపాటి అశోక్ గజపతిరాజు దత్తత తీసుకొన్నా అభివృద్ధిలో నాడు అనాథగానే ఉన్న విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ద్వారపూడి తొలుత వెళ్లాం. ఇంజినీరింగ్ కాలేజీలో పని కోసం వెళ్తున్న మహిళలను ఆపి మాట్లాడాం.

**రోడ్ షో బృందం:** ఏమ్మా... ఈసారి ఎవరికి ఓటేస్తారు?

**సాజుబిల్లి సీతమ్మ, లెంక బంగారమ్మ:** ఓటు ఎవరికి వేస్తామో బయటకు చెప్పం.



నాలుగు మెతుకులు తింటున్నామంటే ఆ విశ్వాసం చూపిస్తాం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు పథకాలన్నీ వస్తున్నాయి. చేయూత డబ్బులు మూడుసార్లు బ్యాంకు ఖాతాలోనే పడ్డాయి. పింఛన్ వలంటీర్లు ఇంటికి తెచ్చిఇచ్చేవారు. పైసా లంచం ఎవ్వరికీ ఇవ్వలేదు. ఎవరి చుట్టూ తిరగలేదు. మాకు ఏ పథకం వస్తుందో వారే తెలుసుకొని వచ్చేలా చేస్తున్నారు. ఇప్పుడు అంతా బాగుంది.

## పార్వతీపురం నియోజకవర్గం సీతానగరం...



పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సీతానగరం మండల కేంద్రంలో చిన్న దుకాణం నిర్వహిస్తున్న భాగ్యలక్ష్మిని రోడ్ షో బృందం పలుకరించింది.

**రోడ్ షో బృందం:** మహిళలకు ఎవరి పాలన బాగుంది?

**భాగ్యలక్ష్మి:** డ్వాక్రాలో ఉన్నవాళ్లందరి రుణాలు మాఫీ చేస్తామంటే 2014 ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటేశాం. అధికారంలోకి వచ్చాక పసుపు కుంకుమ అని రూ.10 వేలు చేతిలో పెట్టారు. అతన్ని నమ్మినవారంతా బ్యాంకు వాళ్లతో ఇబ్బందులు పడ్డాం. కానీ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తానంటే చేస్తారంతే. ఆసరా, చేయూత, సున్నా వడ్డీ పథకాలన్నీ ఎంతో ఉపయోగపడుతున్నాయి. మేమైతే జగన్‌మోహన్‌రెడ్డికే ఓటేస్తాం.

## పార్వతీపురం మండలం వెంకంపేట...



పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామంలో రచ్చబండపై కూర్చున్నవారిని పలుకరించాం. అక్కడున్న రైతులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తి వ్యక్తంచేశారు.

**పెదిరెడ్డి సింహాచలనాయుడు, రైతు:** గతంలో ఏ సమస్యలతోనైతే రైతులు ఇబ్బందిపడ్డారో జగన్‌మోహన్‌రెడ్డి వాటన్నింటికీ పరిష్కారం చూపించారు. వైఎస్సార్ రైతుభరోసా కేంద్రం మాకు చేయూతగా ఉంది. మా రైతుల గ్రూపుకి యంత్రసాయం కింద ట్రాక్టరు కూడా ఇచ్చారు. విత్తనాల నుంచి పంటల కొనుగోలు చేసేంతవరకు రైతు భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి.

## గుంకలాం హైస్కూల్‌లో...



విజయనగరం రూరల్ మండలంలోని గుంకలాం గ్రామానికి వెళ్లాం. అక్కడ నాడు–నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేసిన హైస్కూల్‌ను పరిశీలించాం. సెలవులు ఇచ్చేశారని విద్యార్థులు అల్లరిచిల్లరగా తిరగకుండా స్థానిక యువత, ఉపాధ్యాయులు చొరవ తీసుకొని ఆ పాఠశాలలోనే కూర్చొబెట్టి వారి విజ్ఞానానికి మెరుగుపెడుతున్నారు. అక్కడున్న ఉపాధ్యాయుడితో మాట్లాడాం. (ఎన్నికల కోడ్ దృష్ట్యా అతని పేరు, ఫొటో ఇవ్వట్లేదు)

**రోడ్ షో బృందం:** మీ ఊరి హైస్కూల్ వేసవిలోనూ ఉపయోగపడుతున్నట్లుందే?

**ఉపాధ్యాయుడు:** నేను కూడా గుంకలాం హైస్కూల్‌లోనే చదివాను. గతంలో పాత భవనాలు రెండే ఉండేవి. సౌకర్యాలు అంతంతమాత్రమే. మా తర్వాత కాలంలో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను విజయనగరంలో ప్రైవేట్ స్కూళ్లకు పంపించేవారు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన పనుల్లో నాకు బాగా నచ్చింది విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు. నాడు–నేడు కార్యక్రమంతో మా పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. అదనపు భవనాలు నిర్మించారు. మరుగుదొడ్లు సహా మౌలిక సదుపాయాలన్నీ కల్పించారు. తరగతికి ఒక్కటి చొప్పున ఐఎఫ్‌పీ బోర్డులు వచ్చాయి. టోఫెల్ శిక్షణ, బైజూస్ కంటెంట్... ఇలా ఎక్కడో కార్పొరేట్ స్కూళ్లలో కూడా లేనటువంటి సౌకర్యాలు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాల్లోకి తీసుకురావడం ఓ అద్భుతమే. అవన్నీ కొనసాగించే ప్రభుత్వాన్నే ఎంచుకోవడం ప్రజల బాధ్యత. మా స్కూల్ విద్యార్థుల సంఖ్య 221 నుంచి గత మూడేళ్లలో 375కి పెరిగింది.

## గుంకలాం గ్రామంలో...

గుంకలాం గ్రామస్తులతో మాట్లాడుతుంటే మా బృందాన్ని ఆ గ్రామ సర్పంచ్ కునుకు వెంకటరావు (నాగరాజు) పలుకరించారు. ఇదే సందర్భంగా ఆ గ్రామంలో రాజకీయ పరిస్థితుల గురించి అడిగాం.

**రోడ్‌షో బృందం:** జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఫలాలు ప్రజలకు చేరుతున్నాయా?



**గుంకలాం సర్పంచ్:** ఒకప్పుడు గ్రామమంతా ఏకమై టీడీపీకి కంచుకోటగా ఉండేవారు. దశాబ్దాలుగా పచ్చజెండా మోసినా గ్రామంలో అభివృద్ధి గురించి పట్టించుకునేవారు కాదు. విద్య, వైద్యం, ఏ అవసరమైనా సరే విజయనగరమో లేదంటే విశాఖపట్నమో పోవాల్సివచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక నాటి పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. ఏకంగా మినీ కలెక్టరేట్ (గ్రామ సచివాలయం)నే మా ఊరికి తెచ్చారు. ప్రజలకు చెంతనే 540 పైగా సేవలు అందుతున్నాయి. రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ వచ్చాయి. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అద్భుతం. దీర్ఘకాలిక రోగులకు, వృద్ధులకు ఇంటివద్దనే వైద్య సేవలు అందేలా చేశారు. ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో మా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాం. ఇదంతా చూసిన గ్రామస్తుల ఆలోచన మారింది. జగనన్నకు ఓటేస్తామనే వారి సంఖ్య 2019 కన్నా బాగా పెరిగింది. మళ్లీ ఆయన ప్రభుత్వమే రావాలని బలంగా కోరుకుంటున్నాం.

## బొండపల్లి మండలం బోడసింగిపేట...

గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బొండపల్లి మండలం బోడసింగిపేట గ్రామంలో పలువురితో మాట్లాడాం.

### బంకురు సూర్యనారాయణ, చిరు ఉద్యోగి:



బాడంగి మండలం నుంచి ఉపాధి కోసం చానాకాలం క్రితమే బోడసింగిపేట వచ్చేశాం. చిన్న ఉద్యోగం చేసుకుంటూ ఇక్కడే అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. గత టీడీపీ పాలన కాలంలో కరువు వల్ల వ్యవసాయం దెబ్బతింది. రైసుమిల్లులు, కోళ్ల ఫారాలు వంటి అనుబంధ పరిశ్రమలు నష్టపోయాయి. నాలాంటి చిన్న ఉద్యోగులకు ఇబ్బందికర పరిస్థితులొచ్చాయి. పొట్టచేత పట్టుకొని మరెక్కడికైనా వలసపోదామనుకున్న సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చింది. రూ.10 లక్షల విలువైన ఇంటిస్థలాన్ని ఉచితంగా ఇచ్చింది. ఇల్లు కట్టుకున్నాం. నా ఉపాధికి ఢోకా లేదు. జగన్‌మోహన్‌రెడ్డి పార్టీనే గెలిపించుకుంటాం.

### బోడసింగి రఘు, మాజీ వలంటీరు:



చంద్రబాబు, పవన్ కల్యాణ్ మా వలంటీర్లను ఎంతగా అవమానించారంటే జిల్లాలో ఉత్తమ వలంటీరుగా పురస్కారం పొందిన నాకే వారిపై అసహ్యం కలిగేది. ప్రజలకు సేవ చేస్తుంటే అంత కసిగా పగబట్టడం అవసరమా? వారి పార్టీలకు బుద్ధిచెప్పడానికే వలంటీరు పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసేశా. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గారి కోసం పనిచేస్తున్నా. వలంటరీ వ్యవస్థను కొనసాగిస్తామన్నా, రూ.10వేలు వేతనం ఇస్తామన్నా చంద్రబాబును మా వలంటీర్లు ఎవ్వరూ నమ్మట్లేదు.

### కోసూరు అనసూయ, గృహిణి:



మేము ఎప్పుడూ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటాం. మేము ఉండటానికి ఇల్లు ఇచ్చారు. పైసా లంచం లేకుండా పథకాలు ఇస్తున్నారు. ఒక కుటుంబం ప్రశాంతంగా జీవించడానికి భరోసా కల్పించారు. ఇంతకన్నా ఇంకేమి కావాలి. టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఒక్క పథకం కూడా ఇలాంటివి లేవు. ఒకటీ రెండు ఉన్నా ప్రతి దానికి జన్మభూమి కమిటీ వాళ్లు చెప్పినవారికే వచ్చేవి. ఇప్పుడలా కాదు మా కాలనీలో అందరికీ అర్హతను బట్టి పథకాలు అందుతున్నాయి. ఇలాంటి ప్రభుత్వాన్ని కాదనుకుంటే కష్టాలను కోరితెచ్చుకున్నట్లే.

## గజపతినగరం మామిడిబంద కాలనీ...

**రోడ్ షో బృందం:** చంద్రబాబు మళ్లీ వస్తే ఉచితంగా ఇసుక ఇస్తానంటున్నారు. గతంలో ఆయన పాలనలో ఇసుక ఉచితమేనా?

**కర్రి వెంకటరమణ, భవననిర్మాణ కార్మికుడు:** చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే. అప్పుడెప్పుడూ ప్రజలకు ఇసుక ఉచితం కాదు. టీడీపీ నాయకుల దగ్గర డబ్బులు పెట్టి కొనుక్కోవాల్సిందే. నాలాంటి భవన నిర్మాణ కార్మికులను ఆదుకున్నది వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులతో మూడేళ్లుగా చేతినిండా పని దొరుకుతోంది. అంతేకాదు నా భార్య శస్త్ర చికిత్సకు వేలాది రూపాయలు ఖర్చు అవుతుందంటే ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేయించారు. మా పిల్లలను ఉన్నత విద్య చదివించుకుంటున్నాం. మద్యం అలవాటు పడినవాళ్లు మాత్రం వాళ్లకు కావాల్సిన బ్రాండ్ దొరకలేదని, రేట్ పెరిగిపోయిందని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు తప్ప సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి కుటుంబం జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉంటుంది.



## గుంకలాం జగనన్న కాలనీలో....


గుంకలాం జగనన్న కాలనీలో పనిచేస్తున్న భవననిర్మాణ కార్మికులు


గుంకలాం జగనన్న కాలనీలో మండపాక మహాలక్ష్మి ఇల్లు

పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 397 ఎకరాల విస్తీర్ణంలో 10,360 కుటుంబాలకు సొంతిల్లును సమకూర్చేందుకు నిర్మిస్తున్న జగనన్న కాలనీకి వెళ్లాం.అదొక కాలనీ కాదు ఏకంగా పట్టణమే నిర్మాణమవుతోంది. అక్కడ భవన నిర్మాణ కార్మికులను పలుకరించాం. వారిలో కొంతమంది టీడీపీ అభిమానులు కూడా ఉన్నారు. ఓటు ఎవరికి వేస్తారని అడిగాం. తాము ఓటు ఎవరికి వేసినప్పటికీ గత టీడీపీ పాలనలో కన్నా ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే తమకు అన్ని పథకాలు వస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. తాము ఓటేయనప్పటికీ మేలు చేశారు. మేలు చేశారు కాబట్టి జగనన్నకు ఓటేస్తామని కొంతమంది ఖరాఖండిగా చెప్పారు. జగనన్న కాలనీ వచ్చినప్పటి నుంచి తమకు ప్రతి రోజూ పని దొరుకుతోందని ఆనందం వ్యక్తం చేశారు.

### అందమైన ఇల్లు నిర్మించుకున్నాం



'ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి స్థలంతో ఇల్లు కూడా మంజూరు చేశారు. ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ కూడా ఉచితమే. అదెంత స్థలం బాత్‌రూమ్‌కు కూడా సరిపోదని, సమాధికే సరిపోతుందని మాట్లాడిన టీడీపీ నాయకులు ఇక్కడికొస్తే ఆ కొద్దిస్థలంలోనే అందంగా మేము నిర్మించుకున్న ఇల్లు చూపిస్తాం. లక్షల రూపాయలు విలువైన ఆస్తిని బహుమతిగా ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరచిపోలేం.

– మండపాక మహాలక్ష్మి, జగనన్న కాలనీ, గుంకలాం, విజయనగరం మండలం


విజయనగరం శివారులోని గుంకలాం జగనన్న కాలనీ

# పోలింగ్ బూత్‌లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

- మాక్ పోలింగ్ ఉదయం 5.30కే ప్రారంభించాలి
- సూక్ష్మ పరిశీలకులు పోలింగ్ బూత్‌ల వద్ద కనీస సౌకర్యాలను తనిఖీ చేయాలి
- సూక్ష్మ పరిశీలకుల శిక్షణలో జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్:

పోలింగ్ బూత్‌లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఫారం–28లో రిపోర్ట్‌ను సాధారణ పరిశీలకులకు పంపించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సూక్ష్మ పరిశీలకులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు తలేత్ పర్వేజ్ ఇక్బాల్, హనీష్ చాబ్రలతో కలిసి సూక్ష్మ పరిశీలకుల విధులను, బాధ్యతలను కలెక్టర్ వివరించారు. సూక్ష్మ పరిశీలకలంతా 12వ తేదీన ఉదయం నియోజకవర్గం స్థాయిలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో రిపోర్ట్ చేయాలని, ముందుగా పోలింగ్ స్టేషన్ పరిధిలో కనీస సౌకర్యాలను తనిఖీ చేసి సాధారణ పరిశీలకులకు నివేదిక ఇవ్వాలని తెలిపారు. పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటకే పోల్ ప్రారంభించాలని తెలిపారు. నిబంధనల మేరకు ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లో ఎన్నికల సిబ్బంది, పోలింగ్ ఏజెంట్‌లు ఎవరికి కేటాయించిన సీట్లలో వారు కూర్చోవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పార్టీ గుర్తులు, రంగులు, కండువాలు, జండాలు వంటివి ఉండకూడదని స్పష్టం చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఆర్‌ఓ ఈవీఎం క్లోజ్ బటన్ తప్పని సరిగా ప్రెస్ చేయాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్‌లు అభ్యర్థికి ఒక్కరు మాత్రమే బూత్‌లో ఉండాలని, మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఏజెంట్ రిలీవర్ ఉండకూడదని స్పష్టం చేశారు. మీడియా వారికి ఎన్నికల కమిషన్ జారీచేసిన అథారిటీ లెటర్ ఉంటేనే అనుమతించాలని, మిగిలిన వారిని అనుమతించ కూడదని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ సుధాకర్‌రావు ఓటింగ్ విధానం, చాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్లైండ్ ఓటు, బీలో ఏజ్, రిజెక్టెడ్ ఓటు తదితర ఓట్లను ఎలా వేయాలనే అంశాలను పీపీటీ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ అనిత, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సాధారణ పరిశీలకులు తలేత్ పర్వేజ్ ఇక్బాల్, హనీష్ చాబ్రా


హాజరయిన ఎన్నిక నిర్వహణ సిబ్బంది, అధికారులు